# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 67 | EDITOR:CHERUKU UPENDAR, | DATE : TUESDAY 4 JULY 2023 | PAGES:4, | RATE: Rs.5/-

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక : 67, | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | తేదీ : మంగళవారం 4 జూలై 2023 | పేజీలు : 4 | వెల : 5/-


### ఉస్మానియా

## ఆసుపత్రిని సందర్శించిన గవర్నర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై ప్రభుత్వానికీ గవర్నర్ తమిళిసై కీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరారాజన్ ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించారు. ఉస్మానియా నూతన

మిగతా 2లో...

### మోడీ మీటింగ్ వేళ....

## సర్దుమణిగినట్టేనా..!



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు


తెలంగాణ బీజేపీలో నేతల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. కొంతకాలంగా ఆ నాయకులు అస్సలు కలుసుకోవడం లేదు. అంతర్గత కుమ్ములాటలు తీవ్రస్థాయిలో ఉండటంతో డైరెక్ట్‌గా అధిష్ఠానమే రంగంలోకి దిగి సమస్య పరిష్కారానికి కృషి చేస్తోంది. మరి ఎడమొహం, పెడమొహంగా ఉన్న ఈ నేతలు ఇవాళ కలుసుకోబోతున్నారా? బీజేపీలో రెండు వర్గాలుగా చీలిపోయిన ఈటెల, బండి సంజయ్ కలుస్తున్న వేదిక ఏంటి? కొంతకాలంగా తెలంగాణ బీజేపీ నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయిలో ఉన్నాయి. పార్టీ నేతలు రెండుగా చీలిపోయి బండి సంజయ్ అనుకూల వర్గంగా, వ్యతిరేకవర్గంగా తయారైంది. బండి సంజయ్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న ఈటల రాజేందర్ మరో గ్రూప్‌కు నాయకత్వం వహిస్తున్నారు. అయితే ఈ

మిగతా 2లో...

# కాంగ్రెస్‌లో ఐక్యత

# కమలంలో ముసలం..!

- అంతర్గత సమస్యలతో భారతీయ జనతా పార్టీ
- తెలంగాణా విషయంలో రివర్స్ నిర్ణయాలు
- సమిష్టిగా పోరాటానికి కాంగ్రెస్ నాయకులు సిద్ధం
- మజ్లిస్ పార్టీ సైతం కాంగ్రెస్ వైపు మొగ్గుకు సంకేతాలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ అంటే అంతర్గత రాజకీయాల పుట్ట. ఆ పార్టీ నేతలు తాము ఎవరిని ఓడించాలన్నదాన్ని సంగతిని ఎప్పుడూ పట్టించుకోరు. తమలో తాము ఎవర్ని ఓడించాలా అని ఆలోచిస్తూ ఉంటారు. అదే బీజేపీ అయితే.. ముందుగా పార్టీ గెలుపు కోసం ప్రయత్నిస్తారు. తర్వాత హైకమాండ్ ఎవరికి పదవి ఇస్తే వారు తీసుకుంటారు. ఇదంతా తెలంగాణ విషయంలో రివర్స్ అయిపోయింది. నిన్నటిదాకా కాంగ్రెస్ పార్టీ తన సహజ లక్షణాలను బహిరంగంగానే బయట పెట్టుకుంది .. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ఐక్యంగాకనిపిస్తోంది. బీజేపీ అంతర్గత సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు పార్టీకి నష్టం కలిగేలా ఎవరూ మాట్లాడటం లేదు. రేవంత్ రెడ్డికి పీసీసీ చీఫ్ పదవి ఇచ్చిన తర్వాత చాలా మంది సీనియర్లు తాము ఆయన కింద పని చేయడం ఏమిటని ఫీలయ్యారు. రేవంత్ స్వయంగా వెళ్లి మాట్లాడినా చాలా మంది సర్దుకోలేదు. కానీ వ్యతిరేక వ్యాఖ్యలు చేసింది మాత్రం ఎక్కువగా జగ్గారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాత్రమే. తర్వాత ఉత్తమ్ కమార్ రెడ్డి తనపై కాంగ్రెస్ నేతలే దష్ప్రచారం చేయిస్తున్నారని ఆరోపణలు చేశారు. కర్ణాటక ఫలితాల తర్వాత ఏర్పడిన వాతావరణం.. డీకే శివకుమార్,

మిగతా 2లో...

### అమరావతిపై రాహుల్ కీలక నిర్ణయం

## రంగంలోకి ప్రియాంక

విజయవాడ- ప్రభాత సూర్యుడు



ఏపీ కేంద్రంగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం కీలక అడుగులు వేస్తోంది. ఏపీ రాజధానిగా అమరావతికి కట్టుబడి ఉన్నామని ఇప్పటికే స్పష్టం చేసిన కాంగ్రెస్ నాయకత్వం.. ఇప్పుడు అదే అంశంతో ఏపీ రాజకీయాల్లో ప్రధాన భూమిక పోషించాలని భావిస్తోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కార్మికులకు మద్దతుగా నిలవాలని నిర్ణయించింది. దీనికి తాజాగా పార్టీ ముఖ్య నేతలకు రాహుల్ గాంధీ దిశా నిర్దేశం చేయనున్నారు. తమ కార్యాచరణ ఖరారు చేసారు. తెలంగాణ కాంగ్రెస్ నిర్వహించిన ఖమ్మం సభలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఢిల్లీ తిరుగు ప్రయాణంలో గన్నవరంలో కొంత సేపు చర్చించారు. గన్నవరం

మిగతా 2లో...

### తెలంగాణ నెక్స్ట్ సీఎం కేటీఆర్?..

## బీఆర్ఎస్‌లో ఊహాగానాలు!

కరీంనగర్- ప్రభాత సూర్యుడు



ప్రస్తుతం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిగా పనిచేస్తున్న తన కుమారుడు కేటీఆర్ రాజకీయ స్థాయిని పెంచాలని ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ (భారత్ రాష్ట్ర సమితి) చీఫ్ కె చంద్రశేఖర్ రావు లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేటీఆర్‌ను ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాలపై తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేయనున్నారని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశంతో ఉన్నారని రాజకీయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. రాహుల్ గాంధీ సంచలన కామెంట్స్ ఢిల్లీలో కేంద్ర మంత్రులతో కేటీఆర్ ఇటీవల

మిగతా 3లో...

## ఈటెలకు బాధ్యతలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

త్వరలో ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాలపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించింది. దీనికి సంబంధించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లోని సీనియర్ నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీలో అంతర్గత తగదాలు నాయకుల మధ్య విభేదాలు చక్కదిద్దేలా

మిగతా 2లో...

### మైక్రోచిప్ టెక్నాలజీ సెంటర్‌ను

## ప్రారంభించిన మంత్రి కేటీఆర్




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మైక్రోచిప్ టెక్నాలజీ సెంటర్ ను మంత్రి కేటీఆర్ హైదరాబాద్ లోని కోకాపేట్ లో ప్రారంభించారు. నాస్కామ్ ప్రకారం గత రెండేళ్లలో టెక్నాలజీ రంగంలో మూడో వంతు ఉద్యోగాలు హైదరాబాద్ లోనే సృష్టించినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించామని చెప్పారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని అన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్ గణనీయమైన అభివృద్ధి సాధించిందని తెలిపారు. దేశానికి లైఫ్

మిగతా 2లో...

## హుటాహుటిన ఢిల్లీకి బండి సంజయ్

### ఆయన పదవి విషయమై రకరకాల ఊహాగానాలు

న్యూ ఢిల్లీ- ప్రభాత సూర్యుడు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కాసేపటి క్రితం ఢిల్లీ చేరుకున్నారు. నేడు బీజేపీ అధిష్టానం పెద్దలను ఆయన కలవనున్నారు. అధిష్టానం పెద్దల పిలుపుతో ఏం జరగనుందనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే తెలంగాణలో ఆయన పదవి విషయమై రకరకాల ఊహాగానాలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే బండి సంజయ్ కూడా తాజాగా కార్యకర్తల వద్ద తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నెల 8వ తేదీన వరంగల్‌లో జరిగే ప్రధాని మోదీ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో హాజరౌతానో లేదోనని బండి సంజయ్ ఆదివారం హన్మకొండలో కార్యకర్తలతో అన్నారు. రాష్ట్ర పార్టీ బాధ్యతలను బండి సంజయ్ నుంచి తప్పించి కేంద్ర క్యాబినెట్‌లోకి తీసుకుంటారని.. రాష్ట్రంలో పార్టీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని నియమిస్తారని ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటూ పార్టీ కేడర్‌లో జోష్ నింపే ఆయన.. ఆదివారం ముభావంగా ఉండిపోయారు. 8న ప్రధాని మోదీ వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా కిషన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి అక్కడ ఏర్పాట్లను సమీక్షించిన సంజయ్.. అంటీముట్టనట్లుగా వ్యవహరించారు. వరంగల్‌లో జరిగిన మీడియా సమావేశంలో తన సహజశైలికి భిన్నంగా ముక్తసరిగా మాట్లాడారు. ఒకవేళ పార్టీ రాష్ట్ర బాధ్యతల నుంచి తనను తప్పించినా.. అధైర్యపడవద్దని బండి సంజయ్

మిగతా 2లో...

### బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని

## బొంద పెడతాం



ఖమ్మం- ప్రభాత సూర్యుడు

ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో కాంగ్రెస్ నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఖమ్మంలో జరిగిన తెలంగాణ జనగర్జన సభకు హాజరైన ఉమ్మడి ఖమ్మం జిల్లా అభిమానులందరికి కృతజ్ఞతలు. 27న మేము రాహుల్ గాంధీని కలిశాం. కేవలం 5 రోజుల్లో జనగర్జన సభ ఏర్పాట్లు చేశాం. కొందరు

మిగతా 2లో...

## మోడీ మీటింగ్ వేళ....

# సర్దుమణిగినట్టేనా..!

(మొదటిపేజీ తరువాయి)

ఇద్దరు నేతల మధ్య మిగతా నాయకులు కూడా చీలిపోయారు. ఇటీవల కాలంలో బండిసంజయ్, ఈటల రాజేందర్ ఇద్దరూ కూడా ఎదురెదురు పడలేదు.కొద్దికాలంగా ఈటల రాజేందర్ పార్టీకి సంబంధించిన ముఖ్య కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అంతేకాదు ఈటల అసంతృప్తిగా ఉన్నారని తెలిసి పార్టీ అధినాయకత్వం ఢిల్లీకి పిలిపించుకుని మాట్లాడారు. ఈ సమయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సభ జరగడంతో ఈ వేదికలో కూడా ఇద్దరు నేతలు కలవలేదు. అయితే ఇప్పుడు నాయకత్వ మార్పుపై బీజేపీలో విస్తృతంగా చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఇద్దరు నాయకులపై అందరి దృష్టి పడింది.ఈనెల 8వ తేదీన వరంగల్‌లో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభ ఉంది. బీజేపీ ముఖ్యనాయకులంతా సభ ఏర్పాటు పరిశీలన కోసం వరంగల్ వెళ్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సన్నాహక సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఈటల రాజేందర్ ఎదురెదురు పడబోతున్నారుఇద్దరు నేతలు ఎదురైతే ఎలా ఉంటుందో చూడాలని కాషాయ కార్యకర్తలతోపాటు మిగతా పార్టీల నేతలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇక కొత్త అధ్యక్షుడిగా పేరు వినిపిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా సన్నాహక సమావేశానికి హాజరవుతున్నారు. ఈ ముగ్గురు నాయకుల కలయిక ఆసక్తిగా మారింది. ఇవాళ హన్మకొండలో జరిగే కార్యక్రమానికి పెద్దయెత్తున బీజేపీ కార్యకర్తలు విచ్చేస్తున్నారు. విభేదాల కాషాయంలో ఏమి జరుగుతుందో చూడాలి మరి.

## అమరావతిపై

# రాహుల్ కీలక నిర్ణయం

## రంగంలోకి ప్రియాంక

(మొదటిపేజీ తరువాయి)

విమానాశ్రయంలో ఏపీకి చెందిన కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. ఆ సమయంలో ఏపీ రాజకీయాల పైన చర్చించారు. విశాఖ స్టీల్ ట్ విషయంలో రాహుల్ మరోసారి పార్టీ విధానం స్పష్టం చేసారు. అమరావతి ఏకైక రాజధానిగా అమరావతికి కట్టుబడి ఉన్నామని తేల్చి చెప్పారు. త్వరలో ప్రియాంక అమరావతిలో పర్యటిస్తారని..భూములిచ్చిన రైతులకు మద్దతుగా నిలుస్తారని రాహుల్ వెల్లడించారు. ఏపీకి రాజధాని లేకపోవటం బాధాకరమని వ్యాఖ్యానించారు .అమరావతిలో ప్రభుత్వం తాజాగా అమలు చేస్తున్న నిర్ణయాలను పార్టీ నేతలకు రాహుల్ కు వివరించారు. విభజన చట్టంలోని హామీల అమలు..పోలవరం ప్రాజెక్టు పనులు..రాజధాని నిర్మాణం..ప్రత్యేక హోదా వంటి అంశాల్లో ఏపీకి అన్యాయం జరుగుతోందని పార్టీ నేతలకు రాహుల్ ను నివేదిక రూపంలో అందచేసారు. కేంద్రంలోకి అధికారంలోకి రాగానే ప్రతీ ఒక్క హామీని నెరవేర్చి ఏపీకి కాంగ్రెస్ పార్టీ న్యాయం చేస్తుందని రాహుల్ గాంధీ వారికి భరోసా ఇచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వటానికి కట్టుబడి ఉన్నామని మరోసారి స్పష్టం చేసారు. ఇదే సమావేశంలో కేంద్రంలోని అధికార బీజేపీతో ఏపీలోని రాజకీయ పార్టీల సంబంధాల పైనా రాహుల్ పార్టీ నేతలతో కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. విశాఖ సభలో రాహుల్:రాష్ట్రంలో వైసీపీ..తెలుగుదేశం..జనసేన పార్టీలు ఏం చేస్తున్నాయి..ఆ పార్టీల పైన ప్రజల్లో ఎలాంటి అభిప్రాయం ఉందనే కోణంలో పార్టీ నేతలను రాహుల్ ఆరా తీసారు. ఈ మూడు పార్టీలు బీజేపీతో కలిసే ఉన్నాయని..రాష్ట్రంలో మాత్రం గందరగోళంగా వ్యవహరిస్తున్నాయని పార్టీ నేతలు రాహుల్ కు వివరించారు.ఇదే సమయంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చే నెలలో విశాఖ సభలో పాల్గొటానని రాహుల్ వెల్లడించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు తమ పార్టీ వ్యతిరేకమని స్పష్టం చేసారు. పార్టీ పరంగా కార్యక్రమాలు రాష్ట్రంలో వేగవంతం చేయాలని రాహుల్ ఏపీ నేతలకు నిర్దేశించారు.

## మైక్రోచిప్ టెక్నాలజీ సెంటర్‌ను

# ప్రారంభించిన మంత్రి కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

సైన్సెస్ రాజధానిగా ఉందని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపల్ హైదరాబాద్‌లో ఉందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ తన వర్క్ ఫోర్స్ ను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెమీ కండక్ర్ రంగంలో భారత్ ఇప్పుడిప్పుడే వృద్ధి చెందుతోందన్న మంత్రి కేటీఆర్.. వచ్చే దశాబ్దంలో ఆ రంగంలో భారత్ దూసుకెళ్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆ ప్రక్రియలో హైదరాబాద్ నగరం కీలక పాత్ర పోషించనున్నట్లు మంత్రి కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం వెయ్యి మందికి సొంత ఖర్చులతో శిక్షణ ఇస్తుందన్నారు. ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ స్కిలింగ్ రంగంలో కూడా తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతుందన్నారు. అమెరికాలోని ఆరిజనోనా రాష్ట్రంలో చాండ్లర్ లో మైక్రోచిప్ టెక్నాలజీ కంపెనీ ప్రధాన కార్యాలయం ఉంది. స్మార్ట్, కనెక్టెడ్, సెక్యూర్ ఎంబెడ్ కంట్రోల్ సొల్యూషన్స్ కంపెనీ కల్పిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆటోమేటివ్, ఏరోస్పేస్, డిఫెన్స్, కంప్యూటింగ్ మార్కెట్లకు చెందిన లక్షా 25వేల మంది కస్టమర్లకు ఆ కంపెనీ సేవల్ని అందిస్తోంది. ఈ క్రంలోనే మైక్రోచిప్ సంస్థ అధినేతలకు మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు చెప్పారు. మైక్రోచిప్ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## ఉస్మానియా

# ఆసుపత్రిని సందర్శించిన గవర్నర్

(మొదటిపేజీ తరువాయి)

భవన నిర్మాణాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలంటూ గతంలో ట్విట్టర్ వేదికగా పేర్కొన్న గవర్నర్ తమిళిసై.. ఇప్పుడు నేరుగా ఉస్మానియా ఆసుపత్రిని విజిట్ చేశారు. ఈ సందర్భంగా తమిళిసై బిల్డింగ్ నిర్మాణం తదితర వివరాలను అడిగితెలుసుకున్నారు. బిల్డింగ్ పరిస్థితిని డిప్యూటీ అధికారులు గవర్నర్ కు వివరించారు. అనంతరం తమిళిసై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను కలిసి వారితో మాట్లాడారు. సౌకర్యాలు, వైద్యం అందుతున్న తీరు.. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.గతంలో ఉస్మానియా నూతన భవన నిర్మాణాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలంటూ ట్విట్టర్ వేదికగా పేర్కొన్న గవర్నర్ తమిళిసై.. ఇప్పుడు నేరుగా ఆసుపత్రిని విజిట్ చేయడం ఆసక్తికరంగా మారింది. గతంలో గవర్నర్ చేసిన ట్వీట్‌కి మంత్రి హరీష్‌రావు కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో జరిగే అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు మంత్రి హరీష్‌రావు. ప్రభుత్వం ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు మంత్రి. కోర్టు పరిధిలో ఉండడం వల్ల సైలెంట్‌గా ఉన్నామని మంత్రి పేర్కొన్నారు .

ఇప్పటికే ఉస్మానియా నూతన భవన నిర్మాణంపై గవర్నర్ వర్సెస్ ప్రభుత్వం ఇష్యూ కాకరేపుతోంది. ఉస్మానియా నూతన భవనం నిర్మాణం డిమాండ్ చేస్తూ జస్టిస్ ఫర్ ఉస్మానియా పేరు తో ఇండియన్ పోస్ట్ ద్వారా 8 వందల లెటర్లతో లేఖల ఉద్యమం నడుస్తోంది. అటూ అడ్రస్ తో 400 లెటర్లు పోస్ట్ చేశారు. చీఫ్ జస్టిస్ హై కోర్టు అడ్రస్ తో మరో 400 లేఖలు పోస్ట్ చేశారు. ఉస్మానియాలో తమిళిసై పర్యటిస్తున్న వేళ.. మరోవైపు ఉస్మానియా వైద్యులతో సచివాలయంలో మంత్రి హరీష్‌రావు సమీక్షిస్తున్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెడతాం

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు అభిమానులు అజ్ఞాతంలో ఉండి పని చేశారు. ఈ సభ విజయానికి రహస్యమేమీ లేదు. గడిచిన 4 ఏళ్ళుగా నాకు అధికారం లేకపోయినా నేను ప్రజలతో మమేకమైనాను. దానితో ప్రజలు వారి ప్రేమ అనురాగం ఆప్యాతలు నాపై చూపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనీ శ్రేణులు నాయకులు కలిసి పని చేయబట్టే ఆ సభ అంతలా జరిగిందని అన్నారు. గతంలో అధికార ప్రతి పక్ష పార్టీలు పెట్టిన సభలు చూసారు. వాటిలో ఏ సభ విజయవంతం అయిందో ప్రజలకు తెలుసు.

సభ ఏ విధంగా జరిగిందో నేను చెప్పాల్సిన అవసరం లేదు. రాహుల్ గాంధీ వచ్చిన నాటి నుండి ఎంత అభిమానం ఉందో అభిమానుల జోష్ తో తెలిసిపోతుంది. సభ జరగక ముందే చెప్పా మీ సభ జరిగిన దాని కంటే ఎక్కువమందితో సభ నిర్వహిస్తామని వారికి సభ లో ప్రజలు కనిపించకుంటే వారు పెట్టిన సంక్షేమ పథకం కంటి వెలుగులో చూపించుకొండి. నా కూతురి వివాహానికి నాగార్జున సాగర్ కాలువపై ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జి గురించి తీసివేయాలి ఆదేశించారు. దానిపై మేము కోర్ట్ కి వెళ్లి స్టే తీసుకుని వచ్చాం. రవాణా కోసం ఆర్టీసి బస్సులు కోసం అధికారులను సంప్రదిస్తే ఆ బస్సులను ఆపారు. జూల్లురుపాడులో సుమారు 200 డీసీఎం ట్రక్ లు నిలిపివేశారు. ఆర్టీవోతో మాట్లాడితే ఆయన డీసీఎంలలో ప్రజా రవాణా చేయకూడదు అంటున్నారు. అంత పెద్ద సభలో లక్షల మంది ప్రజలు వస్తె పోలీసులు రక్షణ కల్పించలేదు. అభిమానులు బారికేడ్లను నెట్టి సభ స్టేజ్ వద్దకు వచ్చారంటే పోలీసుల వైఫల్యం ఎంటో అర్థమవుతుంది.

నిన్న జరగరాని ఘటన జరిగి ఉంటే దానికి బాధ్యులు ఎవరు. సీఎం కెసీఆర్ కాదా తెలంగాణ డిజిపి కాదా పోలీస్ వ్యవస్థ కాదా. చివరికి నీతి మాలిన పని మంచి నీటిని నిలిపివేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత నీఛాతి నీచంగా దిగజారింది. గిరిజనుల మీద రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నడూ లేనివిధంగా ప్రేమ నిన్ననే ఒలకబోశారు. పోడు పట్టాలు నిన్న కాకుంటే ఇంకెప్పుడు ఇవ్వమని భయ భ్రాంతులకు గురి చేశారు. గోడకు బంతి కొడితే ఎంత వేగంగా తిరిగి వస్తుందో ప్రజలు అదే చూపించారు. ఓ ఓ పెద్ద మనిషి అంటున్నాడు కన్నీరు కార్చి ప్రజలను సభకు వచ్చేలా చేశారు అని. కాంగ్రెస్ లో స్వాతంత్ర్యం ఎక్కువ కాంగ్రెస్ లో ప్రేమ ఎక్కువ. అది కావాలని ప్రజలు అనుకుంటున్నారు. హిట్లర్ ప్రభుత్వాన్ని కాదు నాయనా ప్రజలు కోరుకునేది. నిన్న వచ్చిన నేషనల్ మీడియా స్టేట్ మీడియాలో ఏ ఛానెల్ చూపించని న్యూస్ కేవలం మీ ఛానెల్ మీ కరపత్ర పేపర్ మాత్రమే చూపించాయి. నిన్న మీరు ఎంత కట్టడి చేసిన ప్రజలను సభకు రాకుండా ఆపలేక పోయారు. కొద్ది రోజుల్లో రాబోతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇదే తీర్పు రాబోతుంది. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రజల దేవెనతో 10 కి 10 సీట్లు ఒడిస్తామని అన్నారు. కానీ నేను అంతటితో ఆగడం లేదు. ఎవరెన్ని కుయుక్తులు వాడిన ఎంత అధికార దుర్వినియోగం చేసిన రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలవబోతున్నాం. ఈ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెడతాం. ప్రజలకు మంచి ప్రభుత్వం అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తామని అన్నారు.

## తెలంగాణ నెక్ట్స సీఎం కేటీఆర్?..

# బీఆర్ఎస్‌లో ఊహాగానాలు!

(మొదటిపేజీ తరువాయి)

జరిపిన సమావేశాల తర్వాత ఆయన తన కుమారుడి రాజకీయ స్థాయిని పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. కేసీఆర్ తన కుమారుడికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల పగ్గాలు అప్పగిస్తారని, ఆ తర్వాత ఆయనకు ప్రభుత్వ బాధ్యతలు అప్పగిస్తారని గతంలో ఊహాగానాలు వచ్చాయి. అయితే ఈ ఊహాగానాలు కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చడం, మహారాష్ట్ర రాజకీయాలపై కేసీఆర్ ఆసక్తి వంటి చర్చల మధ్య, కేసీఆర్ ప్రభుత్వ బాధ్యతను తన కుమారుడు కేటీఆర్ అప్పగించే అవకాశం ఉందని ఇటీవల ఓ వార్త షికారు చేస్తోంది. రాష్ట్ర వ్యవహారాల్లో కేటీఆర్ ప్రత్యక్షంగా, పరోక్షంగా, ప్రత్యేకించి పలు మంత్రిత్వ శాఖల్లో జోక్యం చేసుకోవడంతోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండడంతో ఆయనకు రాష్ట్ర వ్యవహారాల బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో పార్టీ నేతలు కేటీఆర్‌తో సన్నిహిత సంబంధాలు నెరపేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఊహాగానాలు కొనసాగుతున్నప్పటికీ, పార్టీలోని అంతర్గత విభేదాల కారణంగా ముఖ్యమంత్రి అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయడం లేదు. అయితే, బీఆర్ఎస్ అధినేత కేటీఆర్ కనుసన్నల్లోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారని పార్టీ నేతలు గ్రహించారు.

**మళ్లీ గులాబీ గూటికి ఈటల**

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ 2021 మే నెలలో ఈటల రాజేందర్‌ను పార్టీ నుండి బహిష్కరించారు. కేసీఆర్, ఈటల రెండు దశాబ్దాలుగా 'విశ్వసనీయ స్నేహితులు'. 2001 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కలిసి పనిచేసి, 2014లో అధికారంలోకి వచ్చారు. కేసీఆర్ రెండు పర్యాయాలు సీఎంగా, ఈటల మంత్రివర్గంలో రెండు దఫాలు ఉన్నారు. అయితే 2021 మేలో 'భూ అక్రమణల' ఆరోపణలపై కేసీఆర్ తన మంత్రివర్గం నుండి ఈటలను తొలగించడంతో వారి స్నేహం అకస్మాత్తుగా ముగిసింది. 2021 నవంబర్‌లో జరిగిన హుజూరాబాద్ ఉపఎన్నికలో రాజేందర్‌ను బీజేపీ నుంచి గెలుపొందినప్పటికీ, ఆయనను శాసనసభకు రానీయకుండా కేసీఆర్ అడ్డుకున్నారు. అసెంబ్లీలో రాజేందర్‌ను ఎదుర్కోవద్దనే ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రతి అసెంబ్లీ సమావేశాల మొదటి రోజున ఆయనను సస్పెండ్ చేశారు. రాహుల్ గాంధీ సంచలన కామెంట్స్ అయితే ఒక్కసారిగా కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ రాజేందర్ పట్ల అసాధారణమైన అభిమానాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈటలను హత్య చేసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి 20 కోట్ల సుపారీ (కాంట్రాక్ట్) ఇచ్చారని, ఈటలకు ప్రాణహాని ఉందని రాజేందర్ భార్య జమున ఇటీవల ఓ ప్రకటన విడుదల చేశారు. కేటీఆర్ వెంటనే స్పందించి రాజేందర్ భద్రతను పెంచాలని డీజీపీ అంజనీకుమార్‌ను ఆదేశించారు. అనంతరం కేసీఆర్ కూడా జోక్యం చేసుకుని రాజేందర్ భద్రతను పెంచాలని డీజీపీని ఆదేశించారు. రాజేందర్‌కు సాధారణంగా కేబినెట్ మంత్రికి కేటాయించే వై కేటగిరీ భద్రతను కల్పిస్తూ బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో పాటు 16 మంది భద్రతా సిబ్బందిని సమకూర్చాలని శుక్రవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం నుంచి ఈటల వెంట 16 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. దీంతో కేసీఆర్, కేటీఆర్ ఒక్కసారిగా ఈటలపై ఇంతలా స్పందించడంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఈటల తన హత్యకు కుట్ర పన్నారని, గతంలో హుజూరాబాద్ నియోజకవర్గంలో తాను బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు 'హత్య రాజకీయాలు' చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి మీడియా ప్రకటన కూడా విడుదల చేశారు. అయితే కౌశిక్‌కు ప్రాణహాని ఉందన్న విషయంలో కేసీఆర్, కేటీఆర్ నుంచి ఎలాంటి స్పందన లేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అయినప్పటికీ, కౌశిక్‌కు అదనపు భద్రత లభించలేదు. అయితే ప్రతిపక్ష బిజెపి ఎమ్మెల్యే రాజేందర్‌కు వై- కేటగిరీ భద్రతను మంజూరు చేశారు. రాజేందర్‌కు బీజేపీలో అనుకూలత లేదని, ఏ సమయంలోనైనా పార్టీని వీడాలని చూస్తున్నారని, రాజేందర్‌ను మళ్లీ బీఆర్ఎస్‌లోకి దింపేందుకు కేసీఆర్, కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## ఈటెలకు

# బాధ్యతలు

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ అధిష్ఠానం వ్యూహాన్ని రూపొందించినట్టు తెలుస్తోంది. తెలంగాణకు సంబంధించి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న హైకమాండ్ ? రాష్ట్ర అధ్యక్ష మార్పు ఉన్నా లేకున్నా పార్టీపరంగా కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. రానున్న ఎన్నికల కోసం ప్రత్యేకంగా ఎలక్షన్ కమిటీ ఏర్పాటు చేయాలని బీజేపీ జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. టికెట్ల కేటాయింపు, ఎన్నికలకు సంబంధించిన వ్యవహారాలకు కీలకంగా వ్యవహరించే ఈ కమిటీ బాధ్యతలు సీనియర్ నేత ఈటల రాజేందర్‌కు అప్పగించనున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంలో ఈటలకు ఢిల్లీ పెద్దల నుంచి సంకేతాలు వచ్చినట్టు సమాచారం. ఈ మధ్యే ఢిల్లీ వెళ్లి పార్టీ పెద్దలతో ఈటల సమావేశమైన సంగతి తెలిసిందే. అక్కడి నుంచి వచ్చిన ఆ సంకేతాలను బట్టే ఈటల నిన్న ట్వీట్ చేసినట్టు తెలుస్తోంది.ప్రజల ఆశీర్వాదం దొరికే సందర్భం ఆసన్నమైంది, ప్రజల ఆశీర్వాదంతో ఒక సైనికుడిలా పనిచేస్తానని ట్వీట్‌లో ఈటల పేర్కొన్నారు. ఈటల నిన్న రాత్రి చేసిన ట్వీట్ చూసి ఆయన అభిమానులు పండగ చేసుకుంటున్నారు. దాదాపు 60 పదాలతో కూడిన ఈటల ట్వీట్ అనేక విషయాలను చెప్పకనే చెప్తోంది. తెలుగులోనే కాదు ఇదే విషయాన్ని హిందీలోనూ ఈటల ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ, అమిత్ షా, జాతీయ బీజేపీ, తెలంగాణ బీజేపీ ట్విట్టర్స్‌కు ఈ ట్వీట్‌ను ఆయన ట్యాగ్ చేశారు. ఇప్పటి వరకు దాదాపు 56 వేల మంది ఈ ట్వీట్‌ను చూశారు.

## హుటాహుటిన

## ఢిల్లీకి

# బండి సంజయ్

(మొదటిపేజీ తరువాయి)

తనను అభిమానించే కార్యకర్తలు, నాయకులకు బండి నచ్చజెబుతున్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని స్పష్టం చేస్తున్నారు. అయితే, బండివల్లే తెలంగాణలో బీజేపీకి గ్రామీణ స్థాయి వరకు విస్తరించిందని, పోరాట స్ఫూర్తితోనే గ్రామాల్లో అధికార పక్ష నేతల అరాచకాలను ఎదుర్కొన్నామని కార్యకర్తలు ఆదివారం ఆయనతో అన్నారు. బండినే అధ్యక్షుడిగా కొనసాగించాలంటూ కార్యకర్తలు కన్నీళ్లు పెట్టుకున్నారు. కాగా.. బండి సంజయ్ మనస్తాపానికి గురైన విషయం అధిష్ఠానం దృష్టికి వెళ్లిందని.. దీనిపై వారి నిర్ణయం ఏమిటో ఒకటి, రెండు రోజుల్లోనే తేలిపోతుందని.. కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఈ సస్పెన్స్ త్వరలోనే తెరపడుతుందని.. పార్టీ ముఖ్యనేత ఒకరు చెప్పారు.

## కాంగ్రెస్‌లో ఐక్యత

# కమలంలో ముసలం !

(మొదటిపేజీ తరువాయి)

ప్రియాంకా గాంధీ బాధ్యతలు తీసుకోవడంతో ఎలాగైనా గెలిపించి పెడతారన్న నమ్మకానికి వస్తున్నారు. మజ్లిస్ పార్టీ కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్న సంకేతాలు.. తెలంగాణలో ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత ఎక్కువగా ఉందన్న అంచనాలతో అంతా సైలెంట్ అయిపోయారు. కాంగ్రెస్ హైకమాండ్ కూడా వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తోంది. రేవంత్ రెడ్డి ఒక్కరే కాదని.. పార్టీ అంటే అందరూ ఉంటారని..కానీ ఆయన నాయకత్వ స్తానంలో ఉన్నారు కాబట్టి ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచిస్తున్నారు. ధిక్కరిస్తే మాత్రం వెటేనని సంకేతాలిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇలా చాలా సార్లు చెప్పింది కానీ ఎప్పుడూ చేయలేదు. కానీ ఇప్పడు మాత్రం కత్తి నూరడం ఖాయంగా కనిపిస్తోంది. అదే సమయంలో బీజేపీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేని స్థితికి వెళ్లిపోయింది. అయితే బీజేపీలో ఇంకా బహిరంగ విమర్శలు ప్రారంభం కాలేదు. అలాంటివి ప్రారంభమైతే.. ఆ పార్టీ పరిస్థితి తెలంగాణలో మరింత దిగజారిపోతుంది. రాజకీయాల్లో ఏదైనా గెలుపు ఆశలే పార్టని నిలబెడతాయి. ఇంత కాలం కాంగ్రెస్ కు చాన్స్ లేదని అనుకున్నారు .అందుకే ఆ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అయింది. కానీ ఇప్పుడు గెలిచే పార్టీ అనే పరిస్థితి రావడంతో అందరూ సైలెంట్ అయిపోయారు. సర్దుకుపోతున్నారు. కానీ వెనుకబడిపోతుందని భావిస్తున్న బీజేపీలో మాత్రం లుకలుకలు పెరిగిపోతున్నాయి.ఖమ్మంలో రాహుల్ గాంధీ సభ తర్వాత కాంగ్రెస్ మరింత పుంజుకుంటుందనే వాదన వినిపిస్తున్నారు. పెద్ద ఎత్తున జన సమీకరణ చేయబోతున్నారు. సభను విజయవంతం చేసి.. కర్ణాటక తరహాలో పతకాలకు గ్యారంటీలు ఇవ్వాలని అనుకుంటున్నారు. ఖమ్మం సభ తర్వాత జూపల్లి మహబూబ్ నగర్‌లో సభ నిర్వహించనున్నారు. దానికీ రాహుల్ గాంధీ హాజరు కానున్నారు. ఇలా వరుస సభలతో దూసుకెళ్తామని.. ఎవరూ ఆపలేరని కాంగ్రెస్ నేతలు నమ్మకానికి వస్తున్నారు.

## సంపాదకీయం

### మహారాష్ట్రలో కమలం సర్జికల్ స్ట్రైక్స్

సర్జికల్ స్ట్రైక్ గురించి తెలుసుగా. ఉన్నట్టుండి మెరుపు దాడులు చేయడం. బార్డర్‌లోనే కాదు. రాజకీయాల్లోనూ సర్జికల్ స్ట్రైక్ లుం టాయి. మహారాష్ట్ర ఇందుకు ఉదాహరణ. రెండేళ్లలో రెండు దాడు లను ఎదుర్కొన్నాయి ఇక్కడి పాలిటిక్స్. బీజేపీ మైండ్‌గేమ్‌తో దెబ్బకి సీన్ అంతా మారిపోయింది. మహారాష్ట్ర వికాస అఘాడి పేరిట సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కాగా...కేవలం రెండేళ్లలో రెండు పెద్ద దెబ్బలు కొట్టింది బీజేపీ. మొదటి దెబ్బకు ప్రభుత్వం కూలిపోయింది. ఇప్పుడు రెండో దెబ్బకి ప్రతిపక్ష కూటమి పునాది కదిలిపోయింది. ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌పై మేనల్లుడు అజిత్ పవార్ తిరుగుబాటు చేశారు. నాయకత్వం విషయంలో చాన్నాళ్లుగా అసంతృప్తిగా ఉన్నారని పైకి చెబుతున్నా...లోపల జరిగింది మాత్రం వేరే. శివసేనలో ఉన్న అసంతృప్తి నేత ఏక్‌నాథ్ శిందేకి గాలం వేసి ఆ పార్టీని చీల్చిన బీజేపీ...ఆ తరవాత ఎన్‌సీపీ ని టార్గెట్ చేసింది. ఇలా కూటమిలోని రెండు పార్టీలనూ దెబ్బ కొట్టింది. అజిత్ పవార్ తిరుగుబాటుతో ఎన్‌సీపీ కి గట్టి దెబ్బే తగిలింది. మహారాష్ట్రలో తమకు ప్రతిపక్షం అనేదే లేకుండా చేసుకోవాలని ప్లాన్ చేసుకున్న బీజేపీ...దాన్ని కరెక్ట్‌గా అమలు చేసింది. అజిత్ పవార్‌తో పాటు 9 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ మేరకు బీజేపీకి గట్టి పట్టు దొరికినట్టే. మెజార్టీ బాగానే పెరుగు తుంది. ఇప్పటికే 125 మంది ఎమ్మెల్యేల బలం ఉన్న బీజేపీకి కొత్త మంత్రులూ తోడైతే సులువుగా మెజార్టీ సాధించేస్తుంది. ఓవరాల్‌గా రాష్ట్ర రాజకీయాల్ని శాసించే పొజిషన్ వచ్చేస్తుంది. ఈ ఊహించని పరిణామం జరగక ముందే మహారాష్ట్ర డిప్యుటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని హింట్ ఇచ్చారు. అటు ముఖ్యమంత్రి శిందే కూడా ఢిల్లీకి వెళ్లి బీజేపీ పెద్దలతో సంప్రదింపులు జరిపారు. నిజానికి అజిత్ పవార్ గనక తమ వర్గంలోకి ఎంటర్ అవ్వాలని చూస్తే...తాము ఎగ్జిట్ అయిపోతామని శిందే బీజేపీ హైకమాండ్‌తో చెప్పినట్టు సమాచారం. కానీ..ఇప్పుడు ఆయన స్వరం మారిపోయింది. "ఇద్దరు డిప్యుటీ సీఎంలతో మహారాష్ట్రలో ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పాటైంది" అని కామెంట్స్ చేశారు శిందే. చీలిపోయిన ప్రతిపక్ష పార్టీలను ఏకం చేసేందుకు శరద్ పవార్ గట్టిగానే ప్రయత్నించారు. అటు శిందే మాత్రం ఈ కూటమిని చీల్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పోటీలో చివరికి శిందే పైచేయి సాధించారు. ప్రస్తుతానికి అజిత్ పవార్‌కి 40 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్టు తెలుస్తోంది. ఫిరాయింపుల చట్టం నుంచి తప్పించుకోవాలంటే 36 కన్నా ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. అయితే...అటు ఎన్‌సీపీ మాత్రం అజిత్ పవార్‌పై అనర్హతా వేటు వేసేందుకు న్యాయ పోరాటం చేసే అవకాశాలున్నాయి. మరి ఇంత చేసిన బేజీపీ...ఇది ఊహించకుండా ఉంటుందా..? దానికీ ఏదో మార్గం వెతుక్కునే ఉంటుంది. మొత్తానికి మాస్టర్ స్ట్రోక్‌తో మహారాష్ట్ర రాజకీయాల్ని తన గుప్పిట్లోకి తెచ్చుకుంది బీజేపీ. మహారాష్ట్రలో జరిగిన పరిణామాలపై ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ స్పందించారు. రెండ్రోజుల క్రితమే ప్రధాని మోదీ ఎన్‌సీపీ ని ఓ అవినీతి పార్టీ అని విమర్శించారని, ఇంతలోనే అదే పార్టీకి చెందిన లీడర్స్‌ని చేర్చుకున్నారని విమర్శించారు. కొంత మంది ఎమ్మెల్యేలకు మంత్రి పదవి దక్కడం సంతోషంగానే ఉందని అన్నారు. శిందే ప్రభుత్వంతో చేరి తమపై ఉన్న కేసులన్నింటినీ మాఫీ చేయించుకున్నారని సెటైర్లు వేశారు. "రెండ్రోజుల క్రితమే ప్రధాని మోదీ మాది అవినీతి పార్టీ అని విమర్శించారు. ఇప్పుడదే పార్టీ లీడర్స్‌ని ప్రభుత్వంలోకి ఆహ్వానించారు. అజిత్ పవార్ వెన్నుపోటు పొడిచాడు. నాతో కనీసం మాట్లాడలేదు. ఈ సారి నేను ఎలాంటి గూగ్లీ వేయలేదు. నాకు చాలా మంది నేతల నుంచి కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయి. నాకిదేమీ కొత్త కాదు. 1980లో నా పార్టీ 58 మంది ఎమ్మెల్యేలతో లీడ్‌లో ఉంది. ఆ తరవాత అందరూ వెళ్లిపోయారు. కేవలం ఆరుగురు ఎమ్మెల్యేలు మాత్రమే నాకు మిగిలారు. అయినా నేను వెనకడుగు వేయలేదు. ఆ సంఖ్యను పెంచుకున్నాను"జులై 6వ తేదీన తదుపరి కార్యాచరణపై పార్టీ మీటింగ్ ఏర్పాటు చేశారు శరద్ పవార్. ఆ రోజు అందరి నేతలతోనూ చర్చించనున్నారు. పార్టీలో చేయాల్సిన మార్పులపైనా ప్రస్తావించనున్నట్టు వెల్లడించారు.

మహారాష్ట్ర డిప్యుటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అజిత్ పవార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్‌సీపీలోని అందరు ఎమ్మెల్యేలూ శిందే వైపే ఉన్నారని తేల్చి చెప్పారు. అంతే కాదు. ఎన్‌సీపీ పార్టీ పేరు, గుర్తుతోనే రానున్న ఎన్నికల్లో బరిలోకి దిగుతామని స్పష్టం చేశారు. ఇప్పటికే శివసేన విషయంలో ఇది జరగ్గా...ఇప్పుడు అదే సమస్యలో ఎన్‌సీపీ కి ఎదురవుతోంది. చాలా రోజులుగా చర్చించిన తరవాతే ఈ నిర్ణయం తీసుకున్నాని వెల్లడించారు అజిత్ పవార్. ఏం చేసినా అదంతా అభివృద్ధి కోసమే అని తెలిపారు. "ఎన్‌సీపీ పార్టీ మొత్తం శిందే ప్రభుత్వంలో చేరినట్టే లెక్క. ఆ పార్టీ పేరు, గుర్తుతోనే ఎన్నికల్లో పోటీ చేస్తాం. మేం మాత్రమే వాటిని వాడుకుంటాం. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మార్పులు జరిగినా వాటన్నింటినీ గమనిస్తూ వచ్చాం. అభివృద్ధికే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నాకే ఎన్‌సీపీ నుంచి బయటకు వచ్చేశాం. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరుగుతుంది. ఎన్‌సీపీ నుంచి వచ్చేసిన నేతల్లో మరి కొందరికి మంత్రి పదవులు దక్కుతాయి"ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ విజనరీని పొగిడారు అజిత్ పవార్. ఆయన నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ప్రశంసించారు. ప్రస్తుతం తాను తీసుకున్న నిర్ణయాన్ని చాలా మంది వ్యతిరేకిస్తున్నారని, కానీ అవేమీ పట్టించుకోనని తేల్చి చెప్పారు. మహారాష్ట్ర ప్రజల ఆకాంక్షల మేరకే ప్రభుత్వానికి మద్దతునిస్తున్నట్టు వెల్లడించారు. నాగాలాండ్‌లో 7గురు ఎన్‌సీపీ ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీన్నే ప్రస్తావిస్తూ తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు అజిత్ పవార్.

# విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

### మెట్రో రైళ్లలో విద్యార్థులకు స్టూడెంట్ పాస్ సదుపాయం

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు : విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. హైదరాబాద్ నగరంలో మెట్రో రైళ్లలో విద్యార్థులు ప్రయాణించేందుకు వీలుగా స్టూడెంట్ పాస్ సదుపాయాన్ని కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. మెట్రో రైళ్లలో విద్యార్థులు ఇక నుంచి హ్యాపీగా స్కూళ్లు, కాలేజీలకు వెళ్లవచ్చు. నేటి నుంచి మెట్రో రైళ్లలో స్టూడెంట్ పాస్ అందుబాటులోకి తెచ్చినట్లు మెట్రో రైల్వే అధికారులు తెలిపారు. 20 ట్రిప్పుల చార్జీతో 30 ట్రిప్పులు ప్రయాణించే అవకాశం కల్పించినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు.షరతులు వర్తిస్తాయి...మెట్రో పాస్



కోసం విద్యార్థులు తప్పనిసరిగా కొత్తగా బ్రాండ్ చేయబడిన స్మార్ట్ కార్డ్స్ కొనుగోలు చేయాలి.ట్రిప్ పాస్ చెల్లుబాటు కొనుగోలు తేదీ నుంచి 30 రోజుల వరకు పని చేస్తోంది.ఈ ఆఫర్ 1 జూలై 2023 నుంచి 31 మార్చి 2024 వరకు తొమ్మిది నెలల పాటు అందుబాటులో ఉంటుంది.ఒక్కో విద్యార్థికి ఒక స్మార్ట్ కార్డ్ మాత్రమే జారీ చేయబడుతుంది.1 ఏప్రిల్ 1998 తర్వాత జన్మించిన విద్యార్థులు పాస్ పొందేందుకు అర్హులు. ఈ ఆఫర్ పరిమిత కాలం పాటు అందుబాటులో ఉంటుంది.

సంస్థ నిర్ణయం ప్రకారం ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చు.విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెడ్ లైన్ – ఏయూజ కళాశాల, రాఖీ నగర్, అమీర్‌పేట్, విక్టోరియా మెమోరియల్, దిల్‌షుఖ్ నగర్ గ్రీన్ లైన్ – నారాయణగూడ, బ్లూ లైన్ – నాగోల్, పరేడ్ గ్రౌండ్స్, బేగంపేట్ మరియు రాయదుర్గ్ వద్ద పాస్‌లను కొనుగోలు చేయవచ్చని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

# సీజనల్ వ్యాధుల కట్టడికి పకడ్బందీ చర్యలు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ



పెద్దపల్లి – ప్రభాత సూర్యుడు : సీజనల్ వ్యాధుల కట్టడికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణపై సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరం లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ అదనపు కలెక్టర్లు వి. లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్ లతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో దోమలు అధికం కావడం వల్ల సీజనల్ వ్యాధులు విస్తరించే ప్రమాదం ఉన్నదని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఆదివారం విద్యా సంస్థల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవి లలో చదివే పిల్లల ఆరోగ్య పై ప్రతి రోజూ మానిటరింగ్ చేయాలని, ప్రతి రోజూ పిల్లల ఆరోగ్యంపై వార్డెన్ లు నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. గత సంవత్సరం బేగంపేట, గద్దలపల్లి, గర్రెపల్లి, జూలపల్లి, ముత్తారం, రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అధిక డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, ఈ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.మండలాల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశాలు నిర్వహించాలని, ముందస్తు గానే జాగ్రత్త వహించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు, ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామంలో ఏర్పాటు చేసిన పారిశుధ్య, ఆరోగ్య కమిటీలను భాగస్వామ్యం చేస్తూ విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలను భాగస్వామ్యం చేస్తూ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మహిళలకు, గ్రామస్తులకు విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృత ప్రచారం కల్పించాలని, హెల్త్ మేళాలు ప్రత్యేక పారిశుధ్య డ్రైవులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ పట్ల తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల కు ఆదేశాలు జారీ చేయాలని, గ్రామీణ ప్రాంతంలో యువతను, వివిధ సంఘాలను భాగస్వామ్యం చేస్తూ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించా రు. సీజనల్ వ్యాధుల నివారణ కొరకు వైద్యశాఖ చేపట్టాల్సిన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేయాల ని, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారు లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ పని చేయాల ని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా మలేరియా అధికారి రాజమౌళి, డీ.సీ.హెచ్.ఎస్. డాక్టర్ కె.శ్రీధర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 16నవిశాఖలో బీసీల మహా గర్జన

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు : వచ్చే – పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని, బి.సి లకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లుపెట్టాలని, జనగణన లో కుల గణన చేయాలనీ డిమాండ్ చేస్తూ ఈ నెల 16న బీచ్ రోడ్డు ఏయు కన్వర్షన్ విశాఖలో బీసీ గర్జన సదస్సు ఏర్పాటు చేసినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. హైదరాబాద్ విద్య నగర్ బీసీ భవన్ లో విశాఖ బీసీ గర్జన పోస్టర్ని ఆర్ కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సభకు జాతీయ బి.సి అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు.పార్లమెంటులో ప్రతిపక్షాలు కుల గణన పై మరియు బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్లపై రాజ్యాంగబద్ధమైన హక్కులకై చర్చ జరపాలని కోరారు. కుల గణన జరుపాలని 8 రాష్ట్ర అసెంబ్లీలు తీర్మానాలు చేశాయి. 16 రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. వీరు పార్లమెంట్ ను స్తంబింప చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. రెండు రాష్ట్రాలకు చెందిన



కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు పార్లమెంటును స్తంభింప చేయాలని కోరారు. ఇతర సమస్యలపై రోజు పార్లమెంటులో ఉద్యమాలు చేస్తున్న మాదిరిగా కుల గణన పై కూడా పార్లమెంటులో చర్చ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా జనగణన లో జరిగే అవకాశం ఉన్నా బీసీ వ్యతిరేక వైఖరితో డిమాండును అంగీకరించడం లేదన్నారు. పార్లమె ంటును ప్రతిపక్షాలు స్తంబింప జేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బి.సి కుల గణనపై ఇంతవరకు విధాన ప్రకటన జారి చేయలేదన్నారు. కార్యక్రమంలో బోను దుర్గ నరేష్ రాయుడు రాకేష్ (కాకా) పితాని హనిప్ చంద్ర వేముల రామకృష్ణ, బిసి వెంకట్, ఆళ్ల రామకృష్ణ, శ్రీనివాస్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ – ప్రభాత సూర్యుడు

కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం కొత్తగా ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఇకపై ఇందులోనే రాజకీయ పార్టీలు తమ ఆర్థిక వివరాలను వెల్లడించాల్సి ఉంటుందని పేర్కొంది. ఆర్థిక వివరాలతో పాటు పార్టీలకు సంబంధించిన ఎన్నికల ఖర్చులు, పార్టీకి వచ్చిన విరాళాలకు సంబంధించిన వివరాలను ఈ పోర్టల్ ద్వారా అందించవచ్చని చెప్పింది. దేశంలో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ఆన్‌లైన్ పోర్టల్‌ను తీసుకువచ్చింది. ఎలక్షన్ కమిషన్ ఈ పోర్టల్‌ను 3సీ వ్యూహంలో భాగంగా పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెప్పింది. అక్రమ నిధులను అరికట్టడం, రాజకీయ పార్టీల నిధులు, ఖర్చుల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యం పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెప్పింది. తమ ఆర్థిక నివేదికను ఆన్‌లైన్‌లో ఇవ్వకూడదని భావిస్తే.. అందుకు గల కారణాలను రాతపూర్వకంగా తెలియజే యాలని, ఆన్‌లైన్‌లో సమర్పించకపోతే నిర్దేశించిన ఫార్మాట్‌లో సీడీలు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ కాపీ ఫార్మాట్‌లో నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. ఆన్‌లైన్‌లో ఆర్థిక నివేదికలను దాఖలు చేయనందుకు పార్టీ




పంపిన సమర్థన లేఖతో పాటు అలాంటి అన్ని నివేదికలను ఆన్‌లైన్ లో ప్రచురిస్తుందని ఈసీ పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951, కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. ఆర్థిక నివేదికలను రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది.

## సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషన్ రెడ్డి తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాత సూర్యుడు :** తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక ముఖ్యమంత్రి కేసిఆర్ మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జాఫర్ గూడలో 38 లక్షల రూపాయల నిధులతో డ్వాక్రా మహిళా భవనం, బీసి కమ్యునిటీ హాలును పిగ్లీపూర్ గ్రామంలో 20 లక్షల రూపాయల నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ..సిఎం కేసిఆర్ సారధ్యంలో కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్, వితంతు,వృద్ధాప్య పెంక్షన్‌లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి మహిళా సంక్షేమానికి పెద్దపీట వెస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యంపిపి బుర్ర రేఖ మహేందర్ గౌడ్, జెడ్‌పిటిసి బింగి దేవదాస్ గౌడ్, వైస్ యంపిపి కొలన్ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్‌లు కొర్ర లావణ్య రాధకృష్ణ, కోట రాధ లక్ష్మారెడ్డి, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదిరులు పాల్గొన్నారు.

## బాచారం లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో చోరి



చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలిస్తున్న ఆలయ పూజారి తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్- ప్రభాత సూర్యుడు :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ మన్మోహన్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి చోరీకి పాల్పడి రెండు తులాల బంగారు ఆభరణాలు, 300 గ్రాముల వెండి ఆభరణాలు, హుండీ పగలగొట్టి సుమారు మూడు వేలరూపాయలను మరియూ సిసి టీవి డివిఆర్,మానీటర్‌లను అపహరించారు. ఆలయ పూజారి ముటుకుల సురేష్ కుమార్ చారి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నామోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పొలాసలో గడప గడపకు బిజెపి



**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** ప్రధాని నరేంద్రమోడీ తొమ్మిదేండ్ల సుపరిపాలన ను పురస్కరించుకొని మహాజన్ సంపర్క్ అభియాన్ లో భాగంగా సోమవారం పొలాస గ్రామంలో గడప గడపకు బిజెపి కార్యక్రమాన్ని చేపట్టారు. పొలాస శక్తి కేంద్రం ఇంచార్జ్ ఓల్లాల రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా.బోగ శ్రావణి, పన్నాల తిరుపతి రెడ్డి, రూరల్ మండల అధ్యక్షులు తిరుపతి మోడీ పాలనపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజెవైఎం మండల అధ్యక్షులు పూదరి శ్రీనివాస్ బీజేపి మండల కార్యదర్శి మేళ్ల దామోదర్, బీజేవైఎం అధికార ప్రతినిధి కురుమ రమేష్ , మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి సాంబార్ కళావతి, మల్లీశ్వరి, బూత్ అధ్యక్షులు నత్తి నాగరాజు, కుర్మరాజు, సంఘ తిరుపతి బండపల్లి రామ్, మెల్ల లక్ష్మిరాజం మిల్కురి రాజన్న, భూమేష్, గడ్డి మల్లేశం, తోట సత్యం, రెంటం తిరుపతి, రెంటం గంగారెడ్డి, సిరికొండ శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, ఉమ్మడి శ్రీను, కళ్యాణ్, రోహిత్, నడిపి గంగన్న, రాజు, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### యాదాద్రి లక్ష్మీనరసింహునికి

# ఎమ్మెల్యే కేపి వివేకానంద కిలో బంగారం విరాళం

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల తరఫున స్వామివారికి మొక్కుబడి చెల్లింపు
- ముఖ్య అతిథులుగా మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి
- భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు,ప్రజలు





స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు :** తెలంగాణ రాష్ట్ర సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల తరఫున కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆదివారం కిలో బంగారం విలువచేసే 55,03,500/- రూపాయల నగదును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లతో కలిసి స్వామివారి పట్టు వస్త్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయ విమాన గోపురానికి ఐదు కోట్ల విలువ చేసే సుమారు 10 కిలోల బంగారాన్ని విరాళంగా ఇచ్చినట్లు వారు తెలియజేశారు. కెసిఆర్ భావిభారత ప్రధాని అని,తెలంగాణలో రాబోవు ఎన్నికలతో హ్యాట్రిక్ విజయం సాధిస్తారని మంత్రి మల్లారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్ మల్కాజ్ గిరి, మేడ్చల్ నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు కుటుంబ సభ్యులతో పాటు పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో ప్రదర్శనగా పాల్గొన్నారు.

# మంచిర్యాల స్టేషన్‌కు తీరనున్న సమస్యలు

**అదిలాబాద్ -ప్రభాత సూర్యుడు :** మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. మంచిర్యాల రైల్వేస్టేషన్ లో సమస్యలు తీరనున్నాయి. ప్రత్యేకంగా అభివృద్ధి చేయడానికి అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద ఈ స్టేషన్‌ను కేంద్రం ఎంపిక చేసింది. దేశవ్యాప్తంగా 200 రైల్వే స్టేషన్లను సెలెక్ట్? చేయగా.. ఇందులో మంచిర్యాల స్టేషన్ సెకండ్ ఫేస్‌లో ఎంపికైంది.అమృత్‌స్టేషన్ స్కీమ్‌కు ఎంపిక వడంతో స్టేషన్‌లో చేయాల్సిన పనుల ప్రపోజల్స్‌ను అధికారులు కేంద్రానికి పంపించారు. మూడు ప్లాట్‌ఫామ్స్ ఉండగా, ఫస్ట్ ప్లాట్‌ఫామ్‌పై మాత్రమే టికెట్ కౌంటర్లు ఉన్నాయి. సెకండ్, థర్డ్ ప్లాట్ ఫామ్స్‌పై టికెట్ కౌంటర్లు లేక ఇబ్బందులు ఎదురవు తున్నాయి. స్టేషన్‌లో ప్రయాణికులు కూర్చో వడానికి బెంచీలు కూడా లేవు. సెకండ్, థర్డ్‌ప్లాట్‌ఫామ్స్‌పై రెస్ట్‌రూమ్‌లు, టాయ్‌లెట్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఒక ఫూట్ ఓవర్ బ్రిడ్జి, రెండు లిఫ్టులు మాత్రమే ఉన్నాయి. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్ చైర్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని మరో ఫూట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. స్టేషన్‌లో దొంగల బెడద ఉన్నప్పటికీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల నైట్ టైమ్‌లో మహిళలు భయాందోళన చెందుతున్నారు. మంచిర్యాల నుంచి ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ ఉంది. దీంతో ఇక్కడ రోజూ వేల సంఖ్యలో ప్రయాణికుల రద్దీ ఉంటుంది.చుట్టుపక్కల స్టేషన్లలో ఆగని ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్, రైళ్లకు హాల్టింగ్ ఉండడం వల్ల ప్రయాణికుల రద్దీ రోజురోజుకు పెరుగు తోంది.

దీంతో పాటు మంచిర్యాల రైల్వేస్టేషన్, సింగరేణి పారిశ్రామిక ప్రాంతానికి సెంటర్ పాయింట్‌గా ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన చాలామంది ఇక్కడ స్థిరపడ్డారు. అంతేగాకుండా రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల ప్రజలు మంచిర్యాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడి వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌నుంచి వేలాది మంది ఉపాధి కోసం ఇక్కడికి వలస వస్తుంటారు. సింగరేణి, ఎస్టీపీపీ, ఓరియంట్ సిమెంట్, సిరామిక్స్, రైస్‌మిల్స్‌వంటి ఇండస్ట్రీస్‌తో పాటు హోటల్స్, కన్‌స్ట్రక్షన్ రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఈ కారణాల వల్ల మంచిర్యాల స్టేషన్‌కు తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇప్పటివరకు రైల్వేస్టేషన్‌లో సరైన సౌకర్యాలులేక ప్రయాణికులు పడ్డ ఇబ్బందులు అమృత్ స్టేషన్‌స్కీమ్‌తో తీరుతాయని అధికారులు అంటున్నారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద పలు అభివృద్ధి పనులు చేపట్ట నుండడంతో స్టేషన్‌లో ఆధునిక సౌకర్యాలు అందు బాటులోకి రానున్నాయి.

రెస్ట్‌రూమ్‌లు, టాయ్‌లెట్లు, డ్రింకింగ్ వాటర్ సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు పాటు సీసీ కెమెరాలు సైతం పెట్టనున్నారు. అలాగే స్టేషన్ బయట వెహికల్ పార్కింగ్, షాపింగ్ జోన్స్ కోసం స్థలం కేటాయించి అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొం దించారు. ఇంకా అవసరమైన వివిధ వసతులు లు కల్పించనున్నారు. దీంతో త్వరలోనే మంచిర్యాల రైల్వేస్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి.

# అవినీతికి పర్యాయ పదమే కాంగ్రెస్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** కాంగ్రెస్ ఖమ్మం సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల మంత్రి వేముల తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.ఈ మీడియా సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ప్రభుత్వ విప్ ఎం.ఎస్.ప్రభాకర్ ,ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, సురేందర్, సండ్ర వెంకట వీరయ్య ,ఎంపీ వద్ది రాజు రవిచంద్ర ల పాల్గోన్నారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీని పప్పు అంటే కొద్దిగా భాధ అనిపించేది. నిన్న ఖమ్మం సభలో రాహుల్ మాట్లాడిన తీరు చూస్తుంటే పప్పు అనడంలో తప్పేమి లేదు అనిపిస్తుంది. ఇక్కడ కాంగ్రెస్ సన్నాసులు రాసిచ్చిన స్క్రిప్ట్ రాహుల్ చదివి వెళ్లిపోయారు. వచ్చామా మాట్లాడామా పోయామా అన్నట్టు ఉంది రాహుల్ తీరు. రాహుల్‌కు అవగాహన లేదు పరిజ్ఞానం లేదు. అసలు రాహుల్ కు కాంగ్రెస్ లో ఏ హోదా ఉందో అర్థం కాదు. ఏ పదవిలేకున్నా రాహుల్‌యే అన్నీ కాంగ్రెస్‌లో నడిపిస్తారా . రాహుల్ గాంధీ కాదు రిమోట్ గాంధీ లా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రం లో ప్రజలకు కాంగ్రెస్ గురించి అంతా తెలుసు కొత్తగా తెలుసుకోవాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారో చెప్పకుండా ఇక్కడ అది చేస్తాం ఇది చేస్తాం అని రాహుల్ చెబుతున్నారు. మొన్ననే కర్ణాటక లో ఎన్నికలు జరిగాయి ..అక్కడ 4 వేల పెన్షన్ ఇస్తున్నారా ..అక్కడ ఇస్తామని ఎందుకు చెప్పలేదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వెయ్యికి మించి వృద్దులకు పెన్షన్ ఇవ్వడం లేదు. కన్న తల్లికి అన్నం పెట్టనోడు పిన తల్లికి బంగారు గాజులు చేయిస్తా అన్నడంటా.. అట్లనే ఉన్నది రాహుల్ గాంధీ పరిస్థితి. నీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పెన్షన్ ఎంతో తెలుసా రాహుల్ గాంధీ. తెలంగాణ తో పాటు ఎన్నికలు జరిగి నాలుగు ఏళ్లకు పైబడి అధికారంలో ఉన్న రాజస్థాన్,ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో అసలు పెన్షన్ స్కీమ్, దాని వివరాలు ఏంటో తెలుసా...? పక్కన ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో వృద్ధాప్య పెన్షన్




500 రూ. వితంతు పెన్షన్ 350 రూ. వికలాంగులకు 350 రూ. దీనికి కూడా సవాలక్ష కండిషన్లు.రాజస్థాన్ లో 58 నుంచి 75 ఏళ్ల లోపు వృద్దులకు 750 రూ. 75 ఏళ్లు దాటితే 1000 రూ.వితంతు పెన్షన్ 60 నుంచి 74 సంవత్సరాల వారికి 1000 రూ. 75 ఏళ్లు పై బడిన వారికి 1500 రూ. వికలాంగులకు 75% లోపు వైకల్యం ఉంటే 400 రూ. 75% పైగా ఉంటే 1000 రూ. తెలంగాణలో వృద్దులకు,వితంతులకు 200 ఉన్న పెన్షన్ 2వేల రూపాయలు అయ్యింది. వికలాంగులకు 4వేలు రూ. పెన్షన్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణే. మరి రాహుల్ గాంధీ 4వేల రూపాయల పెన్షన్,రాజస్థాన్,ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో ఎందుకు ఇస్తలేడు. అక్కడ ఇచ్చి ఇక్కడ చెప్పాలి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయకుండా,గత 60 ఏళ్లు 200 రూ. ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో నాలుగు వేలు పెన్షన్ ఇస్తాం అని చెప్పితే ప్రజలు నమ్ముతారా..? దేశ వ్యాప్తంగా 4వేల పెన్షన్ ఇస్తామని చెప్పే దమ్ము కాంగ్రెస్ కు ఉన్నదా..? మొన్న అధికారంలోకి వచ్చిన కర్ణాటకలో, మిగతా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మొదలు అమలు చేయండి. తెలంగాణ ప్రజలు పిచ్చోళ్లా ..ఏదీ పడితే అది నమ్మడానికి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మాటలు అస్సలు నమ్మరు. అవినీతి గురించి రాహుల్ మాట్లాడటం హాస్యా స్పదంగా ఉన్నది. అవినీతికి పర్యాయ పదమే కాంగ్రెస్. అవినీతి కి కాంగ్రెస్ రారాజు. రాహుల్ నాన్న రాజీవ్ గాంధీ బోఫోర్స్ కుంభకోణం, ఎంపీగా రాహుల్ అవినీతి ఆరోపణలతోనే ఓడిపోయారు. కేసీఆర్ ది రాచరికం కాదు. రాజు కారు ..88 సీట్లు గెలిచి రెండో సారి సీఎం అయ్యారు. రాహుల్ ఎంపీగా ఓడిపోయారు. అసలు రాహుల్ కు కాంగ్రెస్ లో ఏ పదవి ఉందని హామీలు ఇస్తున్నారు. రాహుల్ కాంగ్రెస్ లో తానే రాజు అనుకుంటున్నారా. కాంగ్రెస్ లో మీది రాచరిక కుటుంబ టీం కాదా. కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు 80 వేల కోట్లు కూడా కాలేదు ..లక్ష రూపాయల అవినీతి జరిగిందని రాహుల్ అంటారా ..దీన్ని బట్టే తెలుస్తోంది ..రాహుల్ కున్న పరిజ్ఞానం ఏమిటో . తెలంగాణ కు మొదట్నుంచి ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీ యే. 1956లో తెలంగాణను బలవంతంగా ఆంధ్రాతో కలిపింది కాంగ్రెస్ పార్టీ కాదా...? వందలాది మంది తెలంగాణ ఉద్యమం లో అమరులు కావడానికి కాంగ్రెస్ పార్టీ కారణం కాదా అని ప్రశ్నించారు.2004 లోనే తెలంగాణ ఇచ్చి ఉంటే ఇంత మంది చనిపోయేవారు కాదు. సీఎంపి లో పెట్టి రాజశేఖర్ రెడ్డి ఒత్తిడి చేస్తే వెనక్కు తగ్గారు. విధి లేని పరిస్థితుల్లోనే అనివార్యంగా కాంగ్రెస్ పదేళ్ల ఆలస్యంగా తెలంగాణ ఇచ్చింది. రాష్టం పదేళ్లు ఆలస్యం కావడం వల్ల తెలంగాణ అభివృద్ధి వెనక్కు నెట్టబడింది ..దానికి కాంగ్రెస్ కారణం కాదా అని ప్రశ్నించారు. మేము ఎవ్వరికీ బీ టీం కాదు. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీ కలిసి పని చేశాయి . కావాలంటే ఈటెల రేవంత్ హోటల్లో కలుసుకున్న ఫోటోలు రాహుల్ కు పంపిస్తా. బిఆర్ఎస్ ప్రజల టీమని అన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLA-PURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICA-TION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com